TGTEL/25/A0348

# సందేశం టైమ్స్

జాతీయ తెలుగు దిన పత్రిక

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికీ అవకాశం కలదు

ఎడిటర్ : 90520 45435

PUBLISH IN TELANGANA సంపుటి : 1 సంచిక: 13 6-6-2025 శుక్రవారం పేజీలు : 4 వెల 2 /-

Published from :Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, Mancherial, Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagiri.

## "సిందూర్" మొక్కను నాటిన ప్రధాని




న్యూ ఢిల్లీ (సందేశం టైమ్స్): ఢిల్లీలోని తన అధికార నివాస ప్రాంగణంలో 'సిందూర మొక్కను నాటారు ప్రధాని మోదీ. బంగ్లాదేశ్ విముక్తి కోసం 1971లో పాకిస్థాన్తో భారత్ చేసిన యుద్ధంలో ధైర్యసాహసాలు ప్రదర్శించిన మహిళా బృందం ఇచ్చిన ఈ మొక్కను.. పర్యావరణ దినోత్సవం సందర్భంగా నాటినట్లు స్వయంగా ప్రధాని ప్రకటించారు.. అందుకు సంబంధించిన ఫొటోలను 'ఎక్స్' వేదికగా పంచుకున్న ఆయన ప్రత్యేక పోస్టు పెట్టారు."బంగ్లాదేశ్ విముక్తి కోసం పాకిస్థాన్తో భారత్ చేసిన యుద్ధంలో కచ్ కు చెందిన తల్లులు, సోదరీమణులు తమ వీర పరాక్రమాలను ప్రదర్శించారు. ఇటీవల నేను గుజరాత్లో పర్యటన చేసిన సమయంలో ఆ మహిళా బృందం నన్ను కలిసింది. అప్పుడే వారు నాకు ఈ మొక్కను అందించారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కను నాటాను. ఈ మొక్కను నాటే గొప్ప అవకాశం నాకు దక్కినందుకు ఎంతో ఆనందంగా ఉంది. ఈ మొక్క మన దేశ మహిళా శక్తి, శౌర్యం, స్ఫూర్తికి బలమైన చిహ్నంగా నిలుస్తుంది" అని పేర్కొన్నారు మోదీ. అందుకు సంబంధించిన ఫొటోలను జత చేశారు.

మిగతా 2లో...

## పర్యావరణాన్ని కాపాడుకునేందుకు కార్యోన్ముఖులు కావాలి..రేవంత్ రెడ్డి



హైదరాబాద్, (సందేశం టైమ్స్): ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కార్యోన్ముఖులు కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన తెలంగాణ సీఎంవో కార్యాలయం ద్వారా ఒక సందేశం విడుదల చేశారు. ప్రకృతిని మనం కాపాడితే అదే మనలను కాపాడుతుందని పేర్కొన్నారు. ఈ ఏడాది పర్యావరణ దినోత్సవ ప్రధానాంశమైన ప్లాస్టిక్ కాలుష్య నియంత్రణకు కట్టుబడి ఉందామని, ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నివారించే ప్రతిజ్ఞ తీసుకుందామని పిలుపునిచ్చారు. సహజ వనరుల సంపదను రాబోయే తరాలకు అందించాలన్నదే ప్రజా ప్రభుత్వ ధృక్పథమని పేర్కొన్నారు.

మిగతా 2లో...

## రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే గండ్ర



మిగతా 2లో...

గణపురం, (సందేశం టైమ్స్): రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. గురువారం భూపాలపల్లి నియోజక వర్గంలోని గణపురం మండలం చెల్పూర్ గ్రామంలో తహశీల్దార్ సత్యనారాయణ స్వామి అధ్యక్షతన ఏర్పాటు చేసిన భూభారతి రెవెన్యూ అవగాహన సదస్సులో భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సాగు చేసుకునే ప్రతి రైతుకు హక్కులు కల్పించి పట్టాలిస్తామన్నారు. రైతులు ఈ రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో భూమికి పట్టాలు కాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారన్నారు. ఒక్క రూపాయి లంచం లేకుండా పారదర్శకంగా పట్టాలిచ్చే కార్యక్రమానికి ప్రజా ప్రభుత్వం శ్రీకారం చుట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

## ఎర్రవల్లిలో మొక్కలు నాటిన జోగినపల్లి సంతోష్ కుమార్



గజ్వేల్, (సందేశం టైమ్స్) : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గజ్వేల్ నియోజకవర్గంలోని మర్కుక్ మండలం ఎర్రవల్లి గ్రామంలో గురువారం మాజీ రాజ్యసభ సభ్యులు, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ వ్యవస్థాపకులు జోగినపల్లి సంతోష్ కుమార్ మొక్కలు నాటారు.ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తన బాధ్యతగా తానూ మూడు మొక్కలు నాటడం చాలా ఆనందంగా ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అన్నారు. మొక్కలు నాటడమే కాదు.. వాటిని రక్షించే బాధ్యత చేపట్టాలన్నారు. గ్రీన్ ఇండియా ఛాలెంజ్ హరితసేనలో భాగంగా మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారకరామారావు, ప్రముఖ సినీ హీరో చిరంజీవి, పద్మశ్రీ అవార్డు గ్రహీత జాదవ్ పయాంగ్ లను మొక్కలు నాటాలని కోరారు. అనంతరం అందరికి ప్రపంచ పర్యావరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి : ఎమ్మెల్యే వివేక్



చెన్నూర్, (సందేశం టైమ్స్): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇవాళ ఉదయం నియోజకవర్గ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ%¾% ప్రతి ఒక్కరూ తమ తమ పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటి వాటిని పరిరక్షించినట్లయితే భావితరాలకు శ్రేష్ఠమైన వాయువును అందించిన వారమవుతామన్నారు. అనంతరం మున్సిపల్ సిబ్బందికి మాస్క్, క్యాప్ లు, తదితర సామాగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మురళి కృష్ణ, సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## త్వరలోనే బాలికా రక్షక టీం.. మంత్రి సీతక్క ప్రకటన



మిగతా 2లో...

హైదరాబాద్,(సందేశం టైమ్స్) : మహిళా శిశు సంక్షేమం కోసం ఎన్నో కొత్త ఆలోచనలకు మేధో మథన సదస్సు ప్రాణం పోసిందని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. రెండు రోజుల పాటు జరిగిన మేధో మథన సదస్సు ముగింపు సభలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. మేధో మథన సదస్సు విజయవంతం అయ్యిందని.. ప్రతీ మూడు నెలలకు ఒకసారి ఇలాంటి సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాల్లో ఇలాంటి సదస్సులు నిర్వహించడం ద్వారా అనుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చున్నారు. ఈ సదస్సులో మహిళా శిశు సంక్షేమంపై పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థలు, మేధావులు తమ విలువైన సలహాలు ఇచ్చారని అన్నారు.మహిళా శిశు సంక్షేమం కోసం నిపుణులతో ఒక అడ్వైజరీ కమిటీ నియమిస్తామని చెప్పారు.

## కేసీఆర్ పిలుపు కోసం కవిత ఎదురుచూపులు




హైదరాబాద్:(సందేశం టైమ్స్): ఎమ్మెల్సీ కవిత ఎపిసోడ్పై బీఆర్ఎస్ లో ఉత్కంఠ కొనసాగుతోంది. పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పిలుపు కోసం కవిత ఎదురుచూస్తున్నారు. ఆమె లేఖ లీక్ వ్యవహారం జరిగి పది రోజులు దాటినా కేసీఆర్ ఇంతవరకు కవితను పిలిచి మాట్లాడలేదు.. సమయం కూడా ఇవ్వలేదు. పార్టీలో అంతర్గత అంశాలు, కేటీఆర్పై కవిత తీవ్ర వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. దీంతో తండ్రి కేసీఆర్ కుమార్తెపై సీరియస్గా ఉన్నారు. మరోవైపు కవిత కార్యక్రమాలకు బీఆర్ఎస్ లీడర్లు, క్యాడర్ దూరంగా ఉన్నారు. జాగృతి ఆధ్వర్యంలోనే కవిత తన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కేసీఆరే తన నాయకుడు అంటున్నప్పటికీ.. బీఆర్ఎస్ కార్యకర్తలు దూరంగా ఉంటున్నారు. కవిత లేఖ వ్యవహారం తర్వాత బీఆర్ఎస్ క్యాడర్ అయోమయంలో పడింది.

**కేటీఆర్ రాక ఆలస్యం..**

మరోవైపు మే 26న లండన్.. అటు నుంచి అమెరికా వెళ్ళిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ యూకేలో పర్యటించి.. అమెరికా డల్లాస్లో జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభలో పాల్గొన్నారు. మరో నాలుగు రోజుల పాటు అమెరికాలోనే ఉండనున్నారు. ఈనెల 10న అమెరికా నుంచి కేటీఆర్ హైదరాబాద్ వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. కేసీఆర్ 11న కాళేశ్వరం కమిషన్ విచారణకు వెళ్ళనున్నారు. దీంతో 10న హైదరాబాద్కు వచ్చేలా కేటీఆర్ ప్రణాలికలు చేసుకున్నారు. మరోవైపు బీఆర్ఎస్లో హాట్ టాపిక్గా కవిత ఎపిసోడ్ కొనసాగుతోంది. కేటీఆర్ అమెరికాలో ఉండగా.. అన్నపై కవిత తీవ్ర విమర్శలు చేసిన విషయం తెలిసిందే. దీంతో కవిత చేసిన కామెంట్స్పై కేటీఆర్ స్పందిస్తారా.. లేదా అనే దానిపై బీఆర్ఎస్లో చర్చ జరుగుతోంది.

తెలంగాణ జాగృతి ద్వారా కవిత కార్యక్రమాలు..కవిత తన రాజకీయ భవిష్యత్తుకు సంబంధించి ప్రస్తుతానికి తెలంగాణ జాగృతి ద్వారా కార్యక్రమాలు నిర్వహించాలనే నిర్ణయంతోనే ఉన్నారని సమాచారం. తండ్రి నుంచి పిలుపు వచ్చినా, రాకున్నా.. తన పని తాను జాగృతి ద్వారా చేసుకుపోవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. తన కార్యక్రమాల్లో జాగృతి జెండాలు, బ్యానర్లు తప్ప.. బీఆర్ఎసకు సంబంధించినవి ఎక్కడా లేకుండా చూసుకుంటున్నారు. తెలంగాణ జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ నాయకులు, కార్యకర్తలతోనే కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందిరాపార్కు వద్ద నిర్వహించిన ధర్నాకు బీఆర్ఎస్ పార్టీ నేతలు, కార్యకర్తలు ఎవరూ హాజరు కాకపోయినా.. కార్యక్రమాన్ని విజయవంతం చేసుకోగలిగామని జాగృతి నేతలు అన్నారు. దీని బట్టి చూస్తే బీఆర్ఎస్లో స్పష్టమైన విభజన వచ్చినట్లు కనిపిస్తోంది. కవిత సాంకేతికంగా గులాబీ పార్టీలో కొనసాగుతున్నా.. వ్యవహారాలు మాత్రం ఎవరికివారే యమునా తీరే అన్న రీతిలోనే నడుస్తున్నాయి. ఏదైనా ఒక కీలక పరిణామం జరిగే వరకు పరిస్థితి ఇదే రీతిలో ఉండే అవకాశాలున్నాయి.

# "సిందూర్" మొక్కను నాటిన ప్రధాని

అరావళి ప్రాజెక్ట్ %ా.

అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా దక్షిణ ఢిల్లీలో అరావళీ గ్రీన్ వాల్ ప్రాజెక్ట్‌ను రీలాంచ్ చేశారు ప్రధాని నరేంద్ర మోదీ. ఈ కార్యక్రమంలో భాగంగా ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీనిలో భాగంగా భగవాన్ మహావీర్ వనస్థలి పార్క్‌లో మర్రిచెట్టును నాటారు . దేశంలో పచ్చదనం వెల్లివిరిసేలా ఎన్డీఏ ప్రభుత్వం చెట్లు నాటే కార్యక్రమాలను చేపట్టింది.

ఇది ఇలా ఉంటే , అరావళీ పర్వత శ్రేణులు విస్తరించిన హర్యానా, రాజస్థాన్, గుజరాత్, ఢిల్లీ రాష్ట్రాల్లోని 29 జిల్లాల్లో చెట్లు పెంచి అడవులను పెంచి పర్యావరణ పరిరక్షణ లక్ష్యంతో కేంద్రం ఈ గ్రీన్ బెల్ట్ కార్యక్రమం కొనసాగిస్తోంది. ఈ ప్రాజెక్ట్ రీ లాంచింగ్ కార్యక్రమంలో నాలుగు రాష్ట్రాల సీఎంలు పంచుకున్నారు. ప్రధాని మోదీతో పాటు ఢిల్లీ సీఎం రేఖా గుప్తా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. హర్యానా సీఎం నాయబ్ సింగ్ సైనీ దాద్రిలో ఈ కార్యక్రమంలో పాల్గొనగా, గుజరాత్‌లో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ కేడాలో, రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మ రామ్‌గర్‌లో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అరావళి పర్వత శ్రేణుల వెంబడి 700 కిలో మీటర్ల పరిధిలో కొన్ని దశాబ్దాలుగా పర్యావరణ సమతుల్యత క్షీణిస్తున్న నేపథ్యంలో అరావళీ గ్రీన్ వాల్ ప్రాజెక్ట్‌కు తిరిగి ఊపిరిలూదుతోంది కేంద్రం. ఆఫ్రికాలోని పశ్చిమ సెనెగల్ నుంచి తూర్పు జిబౌటి వరకు అమలుచేస్తున్న 'గ్రేట్ గ్రీన్ వాల్' ప్రాజెక్ట్ ప్రేరణపొందిన భారత్ అరావళీ గ్రీన్‌వాల్ ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టింది. దీనికోసం మోదీ నేడు లాంచనంగా మొక్కను నాటి ఈ ప్రాజెక్ట్ ను రీలాంచ్ చేశారు..

# రిసోర్స్ మొబలైజేషన్ పై క్యాబినెట్ సబ్ కమిటీ !




## నిధుల సమీకరణ పై తీవ్రంగా దృష్టి సారించాలి
## ప్రతీ వారం సమీక్షలు..

హైదరాబాద్, (సందేశం టైమ్స్): నిధుల సమీకరణపై అధికారులు తీవ్రంగా దృష్టి సారించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. గురువారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో రిసోర్స్ మొబలైజేషన్ క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం కమిటీ చైర్మన్ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగింది.సమావేశంలో సబ్ కమిటీ సభ్యుడు మంత్రి జూపల్లి కృష్ణారావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రెవెన్యూ రిసోర్స్ మొబలైజేషన్ క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం ప్రతివారం జరుగుతుందని, తాజా సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వేగంగా అమలు చేయాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు.తాజా సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, వాటి ప్రగతిని వచ్చేవారం సమావేశంలో అంశాల వారీగా సమీక్షిస్తామని తెలిపారు. తాజా సమావేశంలో రెవెన్యూ రిసోర్స్ మొబిలైజేషన్‌కు సంబంధించి వివిధ శాఖల ఉన్నతాధికారులు చెప్పిన అంశాలు, వాటి పురోగతిని నిరంతరం పరిశీలించడానికి ఆర్థిక శాఖలో ప్రత్యేక అధికారిని నియమించాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. సమావేశంలో శాఖల వారీగా అంశాలను డిప్యూటీ సీఎం సుదీర్ఘంగా సమీక్షించారు.సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఆర్ అండ్ బి ప్రిన్సిపల్ సెక్రెటరీ వికాస్ రాజు, ఎక్సైజ్, కమర్షియల్ టాక్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ రిజ్వీ, సీసీఎల్ఏ నవీన్ మిట్టల్, మైనింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, కమిషనర్లు హరిత, హరికిరణ్, విష్ణువర్ధన్, సురేంద్రమోహన్, బుద్ధ ప్రకాష్ జ్యోతి, ఇలంబర్తి, ఆర్ వి కర్ణన్ తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణాన్ని కాపాడుకునేందుకు కార్యోన్ముఖులు కావాలి..రేవంత్ రెడ్డి

ప్రతిజ్ఞ చేయాలి

చెట్లను పెంచి, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి.. మన ఆరోగ్యమే కాదు, మన భవిష్యత్ తరాల సంపూర్ణ ఆరోగ్యానికి పునాదులు వేద్దాం.. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేద్దాం.. అని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. కాగా, వర్షాకాలం మొదలవుతున్న నేపథ్యంలో కొత్తగా చెట్లు నాటే వన మహోత్సవం కార్యక్రమం ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. గత ఏడాది అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, ఈ ఏడాది మరింత పెద్ద ఎత్తున వన మహోత్సవం చేపట్టబోతున్నారు.

# సింగరేణిలో ప్లాస్టిక్ వినియోగంపై సంపూర్ణ నిషేధం !




(సందేశం టైమ్స్): సింగరేణిలోని హైదరాబాద్ కార్యాలయంతో సహా అన్ని ప్రాంతాలలో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధిస్తున్నట్లు కంపెనీ చైర్మన్, ఎండీ శ్రీ ఎన్. బలరామ్ సంచలనాత్మక ప్రకటన చేశారు.ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా, "ప్రపంచవ్యాప్తంగా ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేద్దాం" అనే నినాదాన్ని స్వీకరించిన సీఎండి బలరామ్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ముఖ్యంగా ప్లాస్టిక్ బాటిళ్లను అస్సలు వాడకూడదని స్పష్టం చేశారు.హైదరాబాద్ సింగరేణి భవన్ లో గురువారం ఆయన ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటి తన సందేశమిచ్చారు. సింగరేణి సంస్థలో ఇప్పటికే పలు రకాల పర్యావరణహిత చర్యలు చేపడుతున్నామని, కొన్నిచోట్ల ప్లాస్టిక్ ను వాడటం మానేశారని, అయినప్పటికీ ఈ ఏడాది ఇచ్చిన ప్రపంచ పర్యావరణ నినాదాన్ని అనుసరించి సింగరేణి కార్యాలయాలు, గనులు, డిపార్ట్ మెంటులలో ప్లాస్టిక్ తో తయారుచేసిన బాటిల్స్, ప్లేట్లు, వస్తువులు తదితరాలపై ఇక సంపూర్ణ నిషేధం విధిస్తున్నట్లు ప్రకటించారు.సంస్థలోని అధికారులను, కార్మికులు, ఉద్యోగులు దీనికి సహకరించాలని కోరారు. తమ ఇంటి వద్ద కూడా ప్లాస్టిక్ వాడకాలను తగ్గించాలని సూచించారు. పర్యావరణం పట్ల అభిమానంతో తాను ఇప్పటికే సింగరేణి వ్యాప్తంగా 19 వేల మొక్కల్ని నాటానని, దీనిని స్ఫూర్తిగా తీసుకొని సంస్థ డైరెక్టర్లు, ఇతర కార్మికులు కూడా మొక్కలు నాటడం ప్రారంభించారని ఇది ఎంతో సంతోషకరమన్నారు. ప్రతి ఒక్కరూ కనీసం 3 మొక్కలు నాటాలని, అటువంటి ఆసక్తి గల వారికి సింగరేణి సంస్థ ఉచితంగా మొక్కలు పంపిణీ చేస్తుందని తెలిపారు. మూడు దశాబ్దాల క్రితం సింగరేణి ప్రాంతాల్లో ఎండాకాలం 50 డిగ్రీలకు పైబడి ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండేవని, సింగరేణి సంస్థ విస్తారంగా మొక్కలు నాటిన కారణంగా, ఆ మొక్కలు అడవులుగా పెరిగి వాతావరణ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు పడిపోయాయని పేర్కొన్నారు.సింగరేణి సంస్థ కు ఒడిశా రాష్ట్రంలో నైనీ బొగ్గు గని ఉన్న అంగుల్ ప్రాంతంలో 50 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నట్టు స్థానికులు తెలియజేశారని చెప్పారు. కనుక అక్కడ కూడా పెద్ద ఎత్తున మొక్కలు నాటడానికి సింగరేణి సంస్థ సంసిద్ధమవుతోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూవెంట్ ) ఎస్ డీ ఎం. సుభాని, జనరల్ మేనేజర్ (మార్కెటింగ్ ) ఎన్.వి. రాజశేఖర్ రావు, ఇంకా వివిధ విభాగాల ఉన్నతాధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. పర్యావరణం పై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన వారికి చైర్మన్ బహుమతుల్ని అందజేశారు. అలాగే కార్యక్రమం లో పాల్గొన్న ఉద్యోగులకు జ్యూట్ బ్యాగుల్ని పంపిణీ చేశారు.

# త్వరలోనే బాలికా రక్షక టీం..
## మంత్రి సీతక్క ప్రకటన

వారి సలహాలు సూచనలతో శాఖ ద్వారా అందుతున్న సేవలను మరింత పటిష్టపరుస్తామని వెల్లడించారు. బాలికల రక్షణ కోసం బాలికలతో స్నేహ కమిటీలను ఏర్పాటు చేస్తామనన్నారు. స్వీయ రక్షణ టీంలుగా స్నేహ కమిటీలు పనిచేస్తాయని చెప్పుకొచ్చారు. అంగన్వాడీ టీచర్ల ద్వారా అమ్మాయిలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అవగాహన కల్పిస్తామన్నారు. మహిళ, బాలికల భద్రత మీద పనిచేసే స్వచ్ఛంద సంస్థలను గుర్తించి అంగన్వాడీలను వారితో అనుసంధానం చేస్తామని అన్నారు. త్వరలో మహిళల హక్కుల మీద పనిచేసే స్వచ్ఛంద సంస్థలతో సమావేశం నిర్వహించి మహిళ భద్రత కోసం పటిష్ట విధానాలను రూపొందిస్తామని మంత్రి తెలిపారు.చాలా చోట్ల ముళ్ళ పొదల్లో, చెత్తకుప్పల్లో అప్పుడే పుట్టిన బిడ్డలను వదిలేసి వెళుతున్నారని.. చీమలు, కుక్కలు, చెత్త, ముండ్ల మధ్య శిశువుల ప్రాణాలు పోతున్నాయన్నారు. దీన్ని నివారించేందుకు వీలున్న చోట ఊయలలను ఏర్పాటు చేస్తామన్నారు. బిడ్డలను పారేయకుండా.. ఆ ఊయలలో వదిలేస్తే వారి బాధ్యతను తామే స్వీకరిస్తామని అన్నారు. తెలంగాణ ఏర్పాటై 10 సంవత్సరాలైనా ఇప్పటికీ బాల్య వివాహ నిరోధక చట్ట రూల్స్‌ను అడాప్ట్ చేసుకోకపోవడం బాధాకరమన్నారు. త్వరలో రూల్స్‌ను అడాప్ట్ చేసుకుంటామని ప్రకటించారు.బాల్య వివాహాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. గ్రామ సభల్లో, ఇతర ప్రభుత్వ కార్యక్రమాల్లో బాల్య వివాహల వల్ల జరిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని మంత్రి తెలిపారు. ఐసీడీఎస్ పథకాలకు తెలంగాణ ప్రాంతంలోనే బీజం పడిందన్నారు. 1972లో మహబూబ్‌నగర్‌లో ఫ్రీడమ్ ఫైటర్ దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఐసీడీఎస్ ప్రారంభించారన్నారు. ఆ అనుభవాల ఆధారంగానే దేశవ్యాప్తంగా ఇందిరా గాంధీ ఐసీడీఎస్ స్కీంను విస్తరింపజేశారని తెలిపారు. అంగన్వాడీ సేవలకు ఆరాధ్యులుగా దుర్గాబాయి దేశ్‌ముఖ్, ఇందిరా గాంధీ నిలిచారని చెప్పుకొచ్చారు. వారి ఆదర్శంగా అంగన్వాడీ సేవలను ప్రతి ఇంటికి చేర్చాలన్నారు.

ఈ ఏడాది వేయి అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాలను నిర్మించి ఇస్తామని వెల్లడించారు. జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసి స్థలాలను గుర్తించాలని ఆదేశించారు. అంగన్వాడీ గదుల్లోనే దేశ భవిష్యత్తు ఉందని.. కాబట్టి దేశ భవిష్యత్తును లిఖించేది అంగన్వాడీ సిబ్బంది అని తెలిపారు. కరీంనగర్‌లో ప్రతీ శుక్రవారం అంగన్వాడీ సిబ్బంది గ్రామస్తులతో సమావేశాలు నిర్వహిస్తున్నారన్నారు. అదే విధంగా అన్ని జిల్లాల్లో అమలు చేయాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల అడ్మిషన్లను , హాజరును పెంచాలని మంత్రి ఆదేశించారు.ఆకాశాన్ని చీల్చుకొని అమ్మాయిలు అంతరిక్షానికి వెళ్లినా భూమి మీద కొన్నిసార్లు రక్షణ కరువవుతుందన్నారు. అందుకే అమ్మాయిల స్వీయ రక్షణ కోసం బాలికా రక్షక టీంలను ఏర్పాటు చేస్తామన్నారు. అమ్మాయిలను వేధిస్తే సంఘ బహిష్కరణకు గురవుతారని హెచ్చరించారు. అమ్మాయిలను ముట్టుకుంటే కఠిన శిక్షలు తప్పవన్నారు. అమ్మాయిల పట్ల చెడుగా ప్రవర్తిస్తే ఇలాంటి శిక్షలు అనుభవించాల్సి వస్తుందో అబ్బాయిలకు అవగాహన కల్పించాలని మంత్రి సీతక్క వెల్లడించారు.

# వసతి గృహాలకు పూర్తిస్థాయి వసతులు కల్పించాలి :
## జాయింట్ సెక్రెటరీ శ్యాంప్రసాద్ లాల్

కరీంనగర్, (సందేశం టైమ్స్) : వసతి గృహాలు ప్రారంభమయ్యే నాటికి పూర్తి స్థాయిలో వసతుల కల్పన ఉండాలని మహాత్మ జ్యోతిబాపూలే జాయింట్ సెక్రటరీ శ్యాంప్రసాద్ లాల్ ఆదేశించారు. ఈరోజు (గురువారం) కరీంనగర్ జిల్లా కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్ని వసతులతో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.వంటగది, వసతి గృహ పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు అందించే యూనిఫార్మ్ ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వసతి గృహాలను నడుపుతుందన్నారు. ఎలాంటి నిర్లక్ష్యం వహించినా సహించమని, నాణ్యమైన ఆహారం అందించాలన్నారు.



# రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి :
## ఎమ్మెల్యే గండ్ర

ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వస్తే ధరణి స్థానంలో భూ భారతి తెస్తామని చెప్పిన ప్రకారం పటిష్టమైన చట్టాన్ని అమల్లోకి తెచ్చినట్లు తెలిపారు.ఈనెల 20వ తేదీ వరకు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని, ప్రజలు ఇచ్చిన ప్రతీ దరఖాస్తు రిజిస్టర్ లో నమోదు చేయాలని ఆదేశించారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి పట్టాలు జారీ చేస్తామని తెలిపారు. ప్రజలు రెవెన్యూ సదస్సుల్లో తమ భూ సమస్యలపై దరఖాస్తు ఇవ్వాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నేతలు, అధికారులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఏసీబీ వలలో మున్సిపల్ ఆర్ఐ ఉద్యోగి..

నిర్మల్ (సందేశం టైమ్స్) : నిర్మల్ జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంపై ఈరోజు (గురువారం) అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మున్సిపల్ కార్యాలయంలోని ఇద్దరు ఉద్యోగులు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడట్టుకున్నారు.సీనియర్ అసిస్టెంట్ ఇంచార్జ్ ఆర్ఐ సంతోష్, కాంట్రాక్ట్ బిల్ కలెక్టర్ షోయబ్‌లు రూ.6,000 లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు వారిని పట్టుకున్నారు. నిర్మల్ మున్సిపల్ కార్యాలయంలో సంతోష్, షోయబ్‌లు లంచం తీసుకుంటున్నారనే పక్కా సమాచారంతో ఏసీబీ అధికారులు ఈ ఆకస్మిక దాడులు నిర్వహించారు.లంచం తీసుకుంటున్న సమయంలోనే అధికారులు వారిని అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం ఏసీబీ అధికారులు వారిని విచారిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.మున్సిపల్ కార్యాలయంపై ఏసీబీ దాడులు, ఇద్దరు ఉద్యోగులు లంచం తీసుకుంటూ పట్టుబడటం నిర్మల్ జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనపై ఏసీబీ అధికారులు మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

# ఉరివేసుకొనిమహిళ అత్మహత్య



NTM 963 న్యూస్ అందోల్ నియోజకవర్గ ఇంచార్జి కే మల్లేశం గౌడ్: సంగారెడ్డి జిల్లా ఉమ్మడిపుల్కల్ మండలం చౌటకూర్ మండలకేంద్రంలోనిన్న అనగా (4)నాలుగో తారీఖు ఏప్రిల్ 2025 నాడు ఉదయం అందాజుగా 11 గంటలకు వచ్చిన మరణ సమాచారం మేరకు తెలిసిన విషయం ఏమనగా అందోల్ మండలం సంగుపేట గ్రామం నుండి కావేరి వయస్సు 23 సంవత్సరాలు అను అమ్మాయి చౌటుకూరు గ్రామానికి చెందిన పోచయ్య అనే అబ్బాయి తో గత సంవత్సరం అనగా 2024 ఆగస్టులో వివాహం చేసుకుని చోటుకూరు గ్రామంలో భర్త తో పాటు అత్తమామలతో కలిసి నివసిస్తున్నది వివాహ అనంతరం మూడు నెలలకే గర్భస్రావ%శీ% అయినది మరియు రెండోసారి కూడా అనగా గత 15 రోజుల క్రితం మరలా గర్భం దాల్చిన విషయం తెలుసుకొని ఆ విషయమై ఆసుపత్రిలో చికిత్స చేయించుకొనగా గర్భంలో ఉన్న శిశువుకు హృదయ స్పందన లేదు అని తెలిసి ఈసారి కూడా గర్భంలో ఉన్న శిశువును తీసివేయాలి అని తెలుసుకొని మరియు భర్త అత్తమామలు ఈ విషయంపై మరియు ఇతర వరకట్నం విషయాలపై కూడా ప్రతిసారి సూటిపోటి మాటలు మాట్లాడేవారు అని భావించి నిన్న అనగా 4 జూన్ 2025 నాడు ఉదయం ఎనిమిదిన్నర గంటలకు ఇంట్లోనే ఫ్యాన్ కు చీర తీసుకుని ఉరివేసుకునగా బయటి నుంచి వచ్చిన భర్త ఇది గమనించి ఇంటి దర్వాజాను పగలగొట్టి లోనికి వెళ్లి చూడగా ఉరి వేసుకున్న విషయం చూసి కిందికి దించి సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకుని వెళ్ళగా డాక్టర్ గారు పరీక్షించి చనిపోయినది అని నిర్ధారించారు ఈ విషయంపై మృతురాల తల్లి అయినా భూమమ్మ వయసు 49 సంవత్సరాలు గ్రామం సంగుపేట. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరుగుతున్నదనిపుల్కల్ ఎస్సై క్రాంతి కుమార్ పాటిల్ అన్నారు.

# 9 నుంచి టీచర్లకు పాఠశాల సన్నద్ధత శిక్షణ



అమరావతి, (సందేశం టైమ్స్): రాష్ట్రంలో ఈనెల 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లకు ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు పాఠశాలల సన్నద్ధత శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ డైరెక్టర్ తెలిపారు. ప్రభుత్వం ఇంతకుముందు జారీ చేసిన ఆదేశాల ప్రకారం... ఈ పాఠశాలల రెడీనెస్ ప్రోగ్రాం కోసం గురువారం నుంచే ఉపాధ్యాయులు పాఠశాలలకు హాజరుకావాల్సి ఉంది. అయితే ఉపాధ్యాయుల బదిలీల కౌన్సిలింగ్ ప్రక్రియ ఇంకా కొనసాగుతున్నందున ఈనెల 9 నుంచి ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# విత్తన ఎంపికే కీలకం



## నకిలీ విత్తనాలతో జాగ్రత్త
## కొనుగోలుపై అవగాహన తప్పనిసరి
## ఖరీఫ్‌నకు సమాయత్తమవుతున్న రైతులు

హిరమండలం,(సందేశం టైమ్స్) : జిల్లాలో ప్రస్తుతం వర్షాలు దండిగా కురుస్తున్నాయి. దీంతో రైతులు ఖరీఫ్ కోసం సన్నద్ధమవుతున్నారు. పొలాలకు ఎరువులు తోలడం, దుక్కులు దున్నడం ప్రారంభించారు. వాతావరణం పూర్తిస్థాయిలో అనుకూలిస్తే నెల రోజుల్లో విత్తనాలు జల్లే పనులు చేపట్టనున్నారు. అయితే, పంట బాగుండాల న్నా.. అధిక దిగుబడులు రావాలన్నా.. తెగుళ్ల తట్టుకోవాలన్నా విత్తన ఎంపికే కీలకం అంటున్నారు వ్యవసాయ నిపుణులు. ఈ సీజన్‌లో కొందరు వ్యాపారులు తక్కువ ధరలో ఎక్కువ దిగుబడినిచ్చే విత్తనాలు తమ వద్ద లభిస్తాయంటూ రైతులను మభ్యపెడు తుంటారు. దీంతో రైతులు ఆకర్షితులై వాటిని కొనుగోలు చేస్తుంటారు. అయితే, ఈ విత్తనాలు చాలా వరకు మొలకలు రావు. ఒకవేళ మొలకలు వచ్చినా గింజలు పొల్లిపోవడం, సరైన దిగుబడి రాకపోవడం జరిగి రైతులు నష్టపోతున్నారు. ఏటా నకిలీ విత్తనాల బారిన పడి అధిక సంఖ్యలో రైతులు మోసపోతున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఖరీఫ్ సీజనల్ విత్తనాలు కొనుగోలు సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. దీనివల్ల నకిలీ విత్తనాలను ముందే గుర్తించవచ్చు. నష్టపోయినా పరిహారం సైతం పొందవచ్చని పేర్కొంటున్నారు. – వ్యవసాయ శాఖ అనుమతి పొందిన దుకాణాల్లో మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి. కొన్నిచోట్ల ప్రభుత్వ అనుమతి లేకుండా కొందరు వ్యాపారులు తెల్ల సంచుల్లో నకిలీ విత్తనాలను విక్రయించే అవకాశం ఉంది. వారి పట్ల అప్రమత్తంగా ఉంటూ.. వారి సమాచారాన్ని తక్షణమే అధికారులకు తెలియజేయాలి. – ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న సంస్థల నుంచే సర్టిఫైడ్ విత్తనాలు కొనుగోలు చేయాలి. కొనుగోలు చేసిన విత్తనాలకు సంబంధించి బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలి. బిల్లుపై రైతు చిరునామా, గడువు తేదీ, విత్తనం ధర, కంపెనీ పేరు, అమ్మినవారి సంతకం తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలి.

# శ్రీశైలంలో పెరుగుతున్న నీటిమట్టం



(సందేశం టైమ్స్): ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి వచ్చే వరదనీటితో రోజురోజుకూ నీటిమట్టం పెరుగుతోంది. సాయంత్రానికి నీటిమట్టం 834.60 అడుగులు ఉండగా.. నీటి నిల్వ 54.55 టీఎంసీలుగా నమోదైంది. సాయంత్రం నుంచి సాయంత్రానికి జూరాల, సుంకేసుల జలాశయం నుంచి 21,334 క్యూసెక్కులు వచ్చి చేరింది. ఇందులో విద్యుదుత్పత్తి, కల్వకుర్తి ఎత్తిపోతలకు 2,543 క్యూసెక్కులు నీరు విడుదల చేశారు.

# గాయపడిన వ్యక్తి మృతి

రాజాం రూరల్, (సందేశం టైమ్స్) : బొబ్బిలి రోడ్డులోని మండల పరిషత్ కార్యాలయం సమీపంలో బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఉదయం తీవ్రంగా గాయపడిన రాగోలు విశ్వనాథం(49) చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందినట్లు సీఐ అశోక్‌కుమార్ తెలిపారు. పట్టణం లోని మెంటిపేట కాలనీకి చెందిన విశ్వనాథం రేషన్ సరుకులు తీసుకు నేందుకు వెళ్తుండగా వెనుక నుంచి మితిమీరిన వేగంతో బైక్ ఢీకొనడంతో ప్రమాదం సంభవించింది. గాయాలపాలైన విశ్వనాథంను తొలుత రాజాం సామాజిక ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం మెరుగైన వైద్యానికి విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు సీఐ తెలిపారు. మృతుడి భార్య మరియమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

# మరోసారి తప్పు చేస్తే చర్యలు



మెళియాపుట్టి, (సందేశం టైమ్స్) : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మరోసారి కుళ్లిన కోడి గుడ్లను సరఫరా చేస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఐసీడీఎస్ సీడీపీవో విమలారాణి హెచ్చరించారు. వచ్చిన ఈ గుడ్లు తినేదెలా కథనంపై ఆమె స్పందించారు. ఈ మేరకు ఉదయం గేదెలపోలూరు అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి విచారణ చేపట్టారు. ఈ కేంద్రంలో పలువురు లబ్ధిదారులకు కుళ్లి కోడి గుడ్లను సరఫరా చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లబ్ధిదారులను పిలిచి మళ్లీ మంచి గుడ్లను అందజేశారు. ఎండల కారణంగా గుడ్లను నిల్వ ఉంచడంతో కుళ్లిపోతున్నాయని తెలిపారు. లబ్ధిదారుల నుంచి వేర్వేరుగా స్టేట్‌మెంట్లు తీసుకున్నారు. వాటిని పీడీకి పంపిస్తామన్నారు. మరోసారి ఇలా జరిగితే కాంట్రాక్టర్‌తో పాటు కార్యకర్తలపై చర్యలు తీసుకుంటామన్నారు. విచారణలో సూపర్‌వైజర్లు రేణుక, అమరావతి, తదితరులు పాల్గొన్నారు. ఇంకోసారి తప్పుచేస్తే చర్యలు తీసుకుంటామని సీడీపీవో హెచ్చరించారు. దీన్నిబట్టి చూస్తే ఇప్పటి ఘటనను గాలికొదిలేసినట్లేనన్న చర్చ సాగుతోంది. తప్పుచేసిన వారిపై చర్యలకు ఎందుకు వెనుకాడుతున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామస్థులు కుళ్లిన కోడిగుడ్ల గురించి చెప్పినా 'ఇంకోసారి తప్పుచేస్తే..' అని సీడీపీవో అన్నడంపై ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

# గంగలకుర్రు అగ్రహారంలో చైన్‌స్నాచింగ్

## సుత్రాలతాడు పోగొట్టుకున్న మహిళ
## మహిళ మెడలో బంగారు సూత్రాలతాడు లాక్కెళ్లిన దుండగులు



అంబాజీపేట, (సందేశం టైమ్స్) : దైవ దర్శనం చేసుకుని ఇంటికి వెళ్తున్న మహిళ మెడ లో మంగళసుత్రాలతో ఉన్న తాడును గుర్తుతెలియిన వ్యక్తులు మోటార్‌సైకిల్‌పై వచ్చి లాక్కుని వెళ్లిపోయారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం గంగలకుర్రు అగ్రహారం గ్రామంలో శ్రీరావుల మ్మ తీర్థం జరిగింది. అంబాజీపేట మండలం ఇరుసుమండ గ్రామానికి చెందిన దొమ్మేటి గంగాభవాని గంగలకుర్రు అగ్రహారం బంధువుల ఇంటికి వచ్చింది. రాత్రి అమ్మవారిని దర్శించుకుని ఇంటికి వెళ్తున్న సమయంలో హైస్కూల్ సమీపంలోని కనకదుర్గమ్మ ఆలయ సమీపంలోకి వచ్చేసరికి చీక టి ప్రాంతంలో మోటార్‌సైకిల్ ఇద్దరు వ్యక్తులు వచ్చి మహిళ మెడలో ఉన్న సుమారు రూ.3 లక్షలు విలువైన 4 కాసుల బంగారు సూత్రాల తాడు దొంగలించుకుపోయారు. దీంతో ఆమె కేకలు వేయడంతో స్థానికులు దొంగలను వెంబడించిన్నప్పటికి మోటార్‌సైకిల్‌పై పారిపోయారు.

# మతిస్థిమితంలేని మహిళ మృతి



విజయనగరం (సందేశం టైమ్స్) : నగరంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మతిస్థిమితం లేని మహిళ మృతదేహాన్ని పెద్ద చెరువులో గుర్తించామని వన్‌టౌన్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. ఇందుకు సంబం ధించిన వివరాల్లోకి వెళితే.. నగరంలోని కొడుగంటేరువారి వీధికి చెందిన కె.ఇందిర (60) మతిస్థిమితం లేక ఇంటి నుంచి బయటకు వెళ్లి రోజూ ఏదో సమయానికి ఇంటికి చేరుకునేదన్నారు. రోజు మాదిరిగానే ఉదయం 6 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లింది. తిరిగి ఆమె ఇంటికి కాకపోవడంతో చుట్టుపక్కలా కుటుంబ సభ్యులు వెతికారు. ఎక్కడా కనిపిం చకపోవడంతో తిరిగి ఇంటికి వస్తుందని వారు భావించారు. ఈక్ర మంలో కొంత మంది వద్ద పెద్దచెరువులో మహిళ మృతదేహం ఉందని తెలి యడం తో భర్త చంద్రన్ వెళ్లారు. మృతదేహం తన భార్యదేనని గుర్తించాడు. చంద్రన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ శ్రీనివాస్ తెలిపారు.

# గోల్డ్ అంతా దోచేసి.. రోల్డుగోల్డ్ వదిలేసి..



- ♦ దొంగలు వదిలేసిన రోల్డుగోల్డ్ ఆభరణాలు
- ♦ వాకతిప్పలో చోరీ
- ♦ 12 తులాల బంగారు ఆభరణాలు,
- ♦ రూ.1.20 లక్షల నగదు పట్టుకెళ్లిన దొంగలు

కొత్తపల్లి, (సందేశం టైమ్స్): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం వాకతిప్పలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా ఉన్న కాలనీలో ఓ ఇంట్లో దొంగలు పడి 12 తులాల బంగారు ఆభరణాల తో పాటు రూ.1.20లక్షల నగదును అపహరించు కునిపోయారు. కేవలం బంగారు వస్తువులనే తీసుకుని రోల్డుగోల్డ్ ఆభరణాలను దివాన్‌కాట్‌పై పెట్టేసి వెళ్లిపోయారు. వివరాల ప్రకారం.. కొత్త పల్లి మండలం పొన్నాడు శివారు శీలం వారి పాలెం ఎలిమెంట్రీ స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పేరూరి శ్రీనివాసరావు వాకతిప్పలో నివాసం ఉంటున్నాడు. వేసవి సెలవులు కావడంతో ఈనెల 2న అన్నవరంలో ఉంటున్న బంధువుల వద్దకు వెళ్లారు. గుర్తు తెలియని వ్యక్తులు 3వ తేదీ అర్ధరాత్రి సమయంలో ఇంటి వెనుక పిట్టగోడ నుంచి లోపలికి ప్రవేశించారు. ఇంటి రెండు గదుల్లో ఉన్న బీరువాలను మారుతాళాలతో తెరిచి లాకర్లో ఉన్న 12 తులాల బంగారు ఆభ రణాలు, రూ.లక్ష నగదు, హాలు లో బాక్స్‌లో వేసిన 10 రూపా యల కాయిన్లు రూ.20 వేలను అపహరించుకుని పోయారని శ్రీనివాసరావు కొత్తపల్లి పోలీసుల కు ఫిర్యాదు చేశాడు. బుధవారం తెల్లవారుజాము సమయంలో తమ ఇంటి పరిసరాల్లో ఉండే ఓ కరు ఇంటి తలుపులు తెరిచి ఉ న్నాయని ఫోన్‌లో చెప్పడంతో సీసీటీవీని పరిశీలించేసరికి తమ ఇంటి గుమ్మం వద్ద సీసీ కెమెరా వేలాడుతూ కనిపించడంతో వెంటనే అన్నవరం నుంచి బయలుదేరి ఇంటికి చేరుకుని చూసేసరికి బీరువా తలుపులు తెరిచి ఉన్నాయని, బీరువాలో ఉన్న బంగారు ఆభరణా లు, నగదు చోరీకి గురయ్యాయని శ్రీనివాసరావు పేర్కొన్నాడు. కేవలం బంగారు వస్తువులనే తీసుకుని రోల్డుగోల్డ్ ఆభరణాలను దివాన్‌కాట్‌పై పెట్టేసి పోయినట్టు గుర్తించారు. కొత్తపల్లి ఎస్ఐ జి.వెంకటేష్ చోరీ జరిగిన ఇంట్లో ఉన్న సీసీ టీవీ పుటేజీని పరిశీలించారు. ఇద్దరు వ్యక్తులు ఇంటి వెనుక నుంచి లోపలికి వచ్చి సీసీ కెమెరాను పక్కకు తిప్పినట్టుగా ఉండటం రికార్డు అయ్యిం ది. ఇంటి లోపలకు వెళ్లినట్టు ఏ ఆధారాలు లేకు ండా దొంగలు చాకచక్యంగా చోరీకి పాల్పడినట్టు పోలీసులు గుర్తించారు. కాకినాడ నుంచి వచ్చిన వేలిముద్రల నిపుణులు బీరువాలు, ఇంటి తలు పులపైన వేలిముద్రలను సేకరించారు. శ్రీనివా సరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

# భాగస్వాముల్లో ఒకరికి ఐదేళ్ల సర్వీస్ లేకున్నా బదిలీ లేదు..

అమరావతి, (సందేశం టైమ్స్): బదిలీల ప్రక్రియపై ఆరోగ్యశాఖ దృష్టి పెట్టింది. దీనిపై ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు హెచ్‌వోడీలతో రెండు గంటలపాటు చర్చించారు. అనంతరం బదిలీలపై రూపొందించిన మార్గదర్శకాల్లో చేసిన స్వల్ప మార్పులకు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆమోదం తెలిపారు. బదిలీల్లో భాగంగా దంపతుల్లో ఎవరైనా ఒకరు ఒకేచోట ఐదేళ్లకన్నా తక్కువే పనిచేసి ఉంటే వారిద్దరినీ అదేచోట కొనసాగించాలని ఈ మార్గదర్శకాల్లో సూచించారు. ఒకేచోట ఐదేళ్ల పదవీకాలం పూర్తిచేసిన వారికి బదిలీల్లో తొలి ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఆ తర్వాత ఒకేచోట రెండు నుంచి ఐదేళ్లలోపు పనిచేసిన వారికి వాళ్లు ఇచ్చిన ఆప్షన్ ఆధారంగా కొత్త స్థానాలు కేటాయిస్తారు. కాంట్రాక్టు నియామకాలతో రెగ్యులర్ పోస్టుల్లో పనిచేస్తున్న వారు మాత్రం యథావిధిగా కొనసాగుతారు. ఆ రెగ్యులర్ స్థానాలను ఖాళీలుగా పరిగణించకూడదని ఆరోగ్యశాఖ నిర్ణయించింది. మరోవైపు వివిధ స్థాయిల్లో ప్రస్తుత సాధారణ బదిలీల నిమిత్తం ప్రకటించని ఖాళీల గురించి ఎంటీ కృష్ణబాబు వాకబు చేశారు. వైద్యకళాశాలల్లో జాతీయ వైద్య సంఘం నిబంధనలు మేరకు వైద్య అధ్యాపకులను కొనసాగించేందుకు కొన్ని ఖాళీలను చూపలేదని, పీపీపీ విధానంలో నిర్వహించాల్సిన వైద్య కళాశాలల్లో గతంలో నియమించిన వారిని రీడిప్లాయ్‌మెంట్ చేయాల్సిన అవసరాల దృష్ట్యా మరికొన్ని ఖాళీలను ప్రకటించలేదని హెచ్‌వోడీలు ఆయనకు తెలిపారు. కాగా, ప్రభుత్వ వైద్యుల సంఘం కూడా ఖాళీలన్నీ చూపించాలని, బదిలీల మార్గదర్శకాల్లో కొన్ని మార్పులు చేయాలని ప్రభుత్వానికి, డీఎంఈకి లేఖ రాసింది. ప్రభుత్వ వైద్యుల సంఘం నేత డాక్టర్ జయధీర్ బదిలీల్లో ఖాళీలు మొత్తం చూపించి, కౌన్సిలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు.

# కొడుకు ఊపిరి ఆపి.. చున్నీతో ఉరేసుకుని..

## కాకినాడలో మహిళ బలవన్మరణం
## కుటుంబ సమస్యలతో నిర్ణయం

కాకినాడ (సందేశం టైమ్స్): అభం, శుభం తెలియని నాలుగేళ్ల కొడుకు నోరు, ము క్కుకు పార్సిల్స్‌కు వేసే ప్లాస్టర్‌ను బిగించి ఊపి రాడకుండా చేసి చనిపోయిన తరువాత తల్లి కూ డా ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని ఆత్మ హత్యకు పాల్పడిన సంఘటన కాకినాడలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం ఉండేశ్వ రపురానికి చెందిన రమ్యదీప్తి (30)కి కాకినాడ రేచర్లపేట దొర్ల వారి వీధికి చెందిన రాజాల శరత్‌బాబుతో 5ఏళ్ల క్రితం వివాహమైంది. వారికి నాలుగేళ్ల కుమారుడు సియాన్ ప్రశాంత్ ఉన్నాడు. కాగా భార్య భర్తలిద్దరూ కొంతకాలం క్రితం ఉపాధి నిమిత్తం కొడుకుతో పాటు గల్ఫ్‌లోని అబుదబిలో ఉ న్నారు. అయితే శరత్‌బాబుకు అక్కడ నుంచి వేరే చోటకు ట్రాన్స్‌ఫర్ అవ్వడంతో ఇక్కడ ఒంటరిగా ఉండడం ఎం దుకు ఇండియాకు వెళ్లిపోమ్మని భార్యకు చెప్పడంతో రమ్యదీప్తి కొడుకుని తీసుకుని 2 నెలల క్రితం ఇండియాకు వచ్చి సీతానగరంలోని అమ్మగారి ఇంటికి వెళ్లింది. అక్కడ నుంచి 10 రోజు ల క్రితం కాకినాడ రేచర్లపేటలో ని అత్తగారింటికి వచ్చింది. అయి తే ఎంఎస్సీ చదివిన రమ్యదీప్తిని అత్త శాంతి, ఆడపడుచు మెర్సీ కలసి ఇంత చదువుకుని ఖాళీగా ఏం చేస్తా వ్ గల్ఫ్ వెళ్లి సంపాదించు అంటూ ప్రతిరోజు మానసికంగా వేధిస్తుండడంతో తట్టుకోలేక తీవ్ర మనస్తాపానికి గురైంది. అర్ధరాత్రి దాటాక తలుపులు గడియ పెట్టుకుని కొడుకుకు ఊపిరాడ కుండా నోరు, ముక్కుకి ప్లాస్టర్ వేసి చనిపోయాడని నిర్ధారించుకున్నాక తాను కూడా ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని విగత జీవురాలైంది. ఉ దయం 8 అయినా తలుపులు తీయకపోయేసరికి అత్త, ఆడపడుచుకు అనుమానం వచ్చి కిటికీ గుండా చూసేసరికి తల్లీకొడుకులు విగతజీవులు గా ఉండడాన్ని గమనించారు. అనంతరం స్థానికుల సాయంతో తలుపులు పగులగొట్టారు. విషయం తెలుసుకున్న మృతురాలి తల్లి గుడేటి అరు ణకుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇన్‌చార్జ్ సిఐ కెవి సత్యనారాయణ సంఘటనా స్థలికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. పోస్ట్‌మార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. టూటౌన్ పో లీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఎట్టకేలకు యాత్రీనివాస్‌కు మోక్షం

- అప్పుఘర్ వద్ద పర్యాటక శాఖ యాత్రీనివాస్ భవనం
- అదనపు ఖర్చుకు కేబినెట్ ఆమోదం
- త్వరలో అందుబాటులోకి వచ్చే అవకాశం



విశాఖపట్నం,(సందేశం టైమ్స్): విశాఖపట్నంలో పర్యాటకులకు ఆ శాఖ తరపున ఒక గది కూడా లేకుండా చేసిన పాపాన్ని వైసీపీ ప్రభుత్వం మూటగట్టుకుంది. ప్రస్తుత ప్రభుత్వం ఆ లోపాన్ని కేబినెట్‌లో బుధవారం సరిచేసింది. పర్యాటక శాఖకు రుషికొండపై హరిత రిసార్ట్స్, ఎంవీపీ కాలనీలోని అప్పుఘర్ వద్ద యాత్రీనివాస్ ఉ ండేవి. రుషికొండపై రిసార్ట్స్‌ను కూలగొట్టి నాటి సీఎం జగన్మోహన్‌రెడ్డి రూ.450 కోట్లతో రాజభవనం నిర్మించుకున్నారు. నిర్మాణం జరిగినంత కాలం అది పర్యాటకుల కోసమేనంటూ వైసీపీ నాయకులు ప్రచారం చేశారు. పూర్తయ్యాక సీఎం నివాసం అన్నారు. దాంతో పర్యాటకులకు రుషికొండపై ఉండడానికి అవకాశం కొరవడింది. ఇక ఎంవీపీ కాలనీలోని యాత్రీనివాస్‌ను రూ.8 కోట్లతో ఆధునికీకరించడానికి ఆ ప్రభుత్వమే ఆమోదం తెలిపింది. పనులు చేపట్టిన తరువాత అంచనా వ్యయం పెరిగింది. అదనంగా మరో రూ.5.5 కోట్లు అవసరమని నాటి ఈఈ రమణ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అంత మొత్తం అయితే కొత్త భవనమే నిర్మించుకోవచ్చు కదా?...అంటూ ఉన్నతాధికారులు ఫైల్ పక్కన పెట్టేశారు. కొత్త ప్రభుత్వం వచ్చాక దానిపై అనేకసార్లు సమీక్షించింది. చివరికి అదనపు సౌకర్యాలు, వసతులు కల్పించేందుకు మాత్రమే ఉపయోగించాలనే నిబంధనతో నిధులు ఇవ్వడానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. దీంతో అవన్నీ పూర్తిచేసి త్వరలో యాత్రీనివాస్‌ను పర్యాటకులకు అందుబాటులోకి తీసుకువచ్చే అవకాశం ఉంది.

# ల్యాబ్ టెక్నీషియన్లు సమయపాలన పాటించాలి




నంద్యాల (సందేశం టైమ్స్) : జిల్లాలోని ఆస్పత్రుల్లో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు సమయపాలన పాటించి విధులకు హాజరై పరీక్షలన్నీ నిర్వహించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా.వెంకటరమణ ఆదేశించారు. పట్టణంలోని జీజీహెచ్‌లోని ఎంసీహెచ్ బ్లాక్‌లో జరిగిన జిల్లా ల్యాబ్ టెక్నీషియన్ల నెలవారి సమీక్షాసమావేశంలో ఆయన మాట్లాడారు. మలేరియా ఎలిమి నేషన్ స్టేజిలో ఉన్నామని, నిర్దేశించిన లక్ష్యాలను ప్రతినెలా పూర్తి చేయాలని ఆదేశించారు. ల్యాబ్‌కు అవసరమైన అన్ని రసాయనాలు, పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలని, అవసరమైన వాటికోసం తన దృష్టికి తీసుకురావాలని సూచిం చారు. జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈ నెల నుంచి ప్రతిరోజు నిర్వహించే రక్తపరీక్షలన్నీ ఐహెచ్‌ఐపీవీబీడీ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. నెలవారి సమర్పించాల్సిన నివేదికలను, ల్యాబ్ రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. సమావేశంలో అదనపు జిల్లా వైద్యాధికారి శారదాబాయి, సహాయ మలేరియా అధికారి రామవిజయరెడ్డి పాల్గొన్నారు.

# ఏజెన్సీలో సీసీ రహదారులపై విజి'లెన్స్'

సీతంపేట (సందేశం టైమ్స్) : సీతంపేట ఐటీడీఏ పరిధిలో గతంలో ఉపాధి హామీ నిధులతో నిర్మించిన రహదారిను శ్రీకాకుళం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ బి.ప్రసాదరావు ఆధ్వర్యంలో పరిశీలించారు. 2019-2023 మధ్య కాలంలో ఏజెన్సీలో నిర్మించిన 32 రహదారులపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీంతో పలుమార్లు సంబంధిత అధికారులు తనిఖీలు చేపట్టారు. తాజాగా కోర్‌కటింగ్ మిషన్ ద్వారా సీసీ రోడ్డు నాణ్యతను తనిఖీ చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన జోడుమానుగూడ, లోకోత్తవలస-నారాయణగూడ, దిగువ సంకిలిగూడ-ఎగువ సంకిలి, బొంగుడుగూడ-బుగతగూడ సీసీ రహదారులను కోర్‌కటింగ్ యంత్రంతో విజిలెన్స్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ విభాగం డీఈ సత్యనారాయణ, ఏఇలు గణేష్, ప్రేమ్‌కుమార్, సీతంపేట గిరిజనసంక్షేమ ఇంజనీరింగ్ డీఈ సింహాచలం, ఏఈ నాగభూషణ్ తదితరులు ఉన్నారు.

# రక్తహీనత నివారణకు కృషి

పార్వతీపురం (సందేశం టైమ్స్) : జిల్లాలో రక్తహీనత నివారణకు కృషి చేయాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ సూచించారు. ఏ ఒక్కరూ ఆ సమస్యతో బాధపడకూడదన్నారు. ఎంఆర్‌నగర్ గ్రామ సచివాలయంలో నిర్వహించిన రక్తహీనత నివారణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 'ప్రతి సచివాలయ పరిధిలో అనీమియా యాక్షన్ కమిటీ సమావేశాన్ని ప్రతి నెలా మొదటి నిర్వహించాలి. ఏఎన్ఎం, ఆశ వర్కర్, సీహెచ్‌డబ్ల్యూ, ఎంహెచ్‌వోలు ప్రతి ఇంటికి వెళ్లి అనీమియా లోపంతో బాధపడుతున్న వారిని గుర్తించాలి. గర్భిణులు, డెలివరీ కేసులను తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయాలి. వారి నెలవారీ పరీక్షలు, ప్రసవం అనంతరం పిల్లలకు ఇవ్వాల్సిన ఇంజక్షన్లు తదితర వాటిని ఏఎన్ఎంలు బాధ్యతాయుతంగా చేపట్టాలి. పీహెచ్‌సీల్లో నార్మల్ డెలివరీ అయ్యేలా చూడాలి. ఖాళీ స్థలంలో ఆకుకూరలు, కూరగాయలు పండించేందుకు విత్తనాలు అందిస్తున్నాం.' అని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా టీబీ నియంత్రణ అధికారి వినోద్‌కుమార్, తహసీల్దార్ వై.జయలక్ష్మి, సీడీపీవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. - దివ్యాంగులు, 65ఏళ్లు పైబడిన వృద్ధుల ఇళ్లకే రేషన్ సరుకులను సరఫరా చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006